# ఘోస్ట్ లవ్




రమణమూర్తి బుద్ధి తెలిసి నప్ప పడలేదు. ఫలానా అమ్మాయిని
ట్నుంచి ఏ ఆడపిల్ల వెంట ప్రేమిస్తున్నట్లు తన మనసైనా

అతనికి చెప్పలేదు. బుద్ధిగా కాలేజీలో చదువు కున్నాడు. అంతకంటె బుద్ధిగా సెప్టెంబర్లకు వెళ్ళకుండా పరీక్షలన్నీ వ్రాసయ్యాడు. మార్కులు చూపించి యూనివర్సిటీలో యమ్మెస్సీ సీటు కొట్టేశాడు. అతనితో చదువుకున్న వాళ్ళలో కొందరు యింకా 'కమ్ సెప్టెంబర్' పాట పాడుతున్నారు.

రమణమూర్తికి 'ఇది తక్కువ' అని లేదు. ఏభై ఎకరాల మాగాణికి యజమాని కొలతలేని గౌరవ మర్యాదలకు మారుపేరయిన రామనాధంగారు అతనికి తండ్రి. మందిరంలో మహాలక్ష్మిలాంటి మహాలక్ష్మమ్మగారు అతనికి తల్లి. అన్నిపనులు చేసి పెట్టటానికి నౌకర్లు ఉన్నారు. సలహాలివ్వటానికి మంచి స్నేహితులున్నారు. కావాలనుకుంటే కొత్త కారు కొని రోజూ యూనివర్సిటీకి రాగలడు. అది యిబ్బంది అనుకుంటే యూనివర్సిటీకి దగ్గరలో ఓ గెస్టహౌస్ కట్టించుకొని ఉండగలడు. ఇలాంటివి యింకా ఎన్నో చేయగలడు. అతనికి చాల చాల అర్హత లున్నాయి. కానీ, అతను బుద్ధి పూర్వకంగా ఏ అమ్మాయిని ఏడిపించలేదు. ప్రేమించడంలాంటిదేమీ చేయలేదు.

కానీ, ఆ రోజు ఆ అమ్మాయిని చూసినప్పుడు రమణమూర్తికి ప్రేమించడం అంటే ఏమిటో తెలియక పోయినా. 'ప్రేమంటే యిదేనేమో?' అని తెలిసి పోయింది.

ఆ రోజు సాయంత్రం దోసిట్లో ముత్యాలు వెదజల్లు తున్నట్లు సన్నని చినుకులు రాలుతున్నాయి. నల్లంచు చీర కట్టుకున్న ఆకాశం ప్రియురాలి మందహాసంలా మెరిసిపోతుంది. అందమైన అమ్మాయి తనను ప్రేమిస్తుందని తెలిసిన కాలేజీ విద్యార్థిలా గాలి రివ్వున వీస్తోంది.

రమణమూర్తి చేతిలో ఉన్న కెమిస్ట్రీ రికార్డు గుండెల దగ్గర దాచుకుంటూ వడివడిగా నడుస్తున్నాడు. తను తడిసినా ఫర్వాలేదు. తన రికార్డు తడ్వకూడదు. తన క్రాపు చెరిగితే తను బాధ పడడు. రికార్డులో అక్షరాలు చెరిగితే బాధ పడిపోతాడు. తన ప్యాంట్ ఫోల్డింగ్స్ నలిగినా తను ఫీలవ్వడు. రికార్డుకి వేసిన అట్ట నలిగితే తను ఫీలయి పోతాడు. ఒక మాటలో చెప్పాలంటే రికార్డును తన ఆరో ప్రాణంగా చూసుకుంటాడు.

నోటీసు యివ్వకుండా వచ్చే వర్షం అంటే తనకు భలే చిరాకు. 'ఈరోజు బస్సులో పోయి ఉండాల్సింద'నుకున్నాడు మనసులో. సాయంత్రం కాలేజీ విడిచిపెట్టగానే ఇంటికి సరదాగా నడిచివెళ్ళడం అంటే తనకెంతో యిష్టం. ఆ రోజంతా

తను విన్న కెమిస్ట్రీ పాఠాల్ని ఎల్లి వేసుకుంటాడు. ఈక్వేషన్లు రిపీట్ చేసుకుంటాడు. ప్రాబ్లెమ్స్‌కి క్లూస్ వెదుకుతాడు. తోవలో కూడ ఓ క్షణం వృథాపోనివ్వడు.

జేమ్స్‌బాండ్ సిన్మాలో ఫైటింగ్‌లా వర్షం క్లయిమాక్స్ చేరుకుంది. రమణమూర్తి దాదాపు వంగిపోతూ నడుస్తున్నాడు. కాసేపు ఆగిపోవటానికి దగ్గరలో ఏ షెల్టరూ కనిపించలేదు. రెండు ఫర్లాంగులు నడిస్తేగాని బస్సుస్టాపు లేదు. తనకి ఏడుపు వచ్చినంత పనయింది. తను ప్రాక్టికల్స్‌లో ప్రత్యేకించి గుర్తింపబడటానికి కారణం తన రికార్డు. ఆ రికార్డు తడిసిపోతే? ఏడాది పొడుగున తను రాస్తున్న ఎక్సర్‌సైజులు ముద్దయిపోతే? ... ప్రొఫెసర్స్‌కి తనమీద యింప్రెషన్ పోతుంది. తనకు మంచి మార్కులు యివ్వరు. క్లాసు పోతుంది.

రమణమూర్తి తల పూర్తిగా తడిసిపోయింది. స్లాక్ వెనకంతా తడిసిపోయింది. మరి కాసేపట్లో విలన్‌లా వర్షం తన రికార్డుమీద విరుచుకుపడుతుంది. రికార్డు తడిసి పోతుంది. ఎవరైనా గొడుగు మనిషి వచ్చినా బావున్ననుకున్నాడు.

అతను తలెత్తి చూశాడు. అదృష్టం బావుంది. అతని వెనకే ఓ అమ్మాయి. గొడుగు పట్టుకొని అడుగులో అడుగు వేస్తూ చీర కుచ్చెళ్ళు కదలకుండా నడుస్తోంది. అతను ఆగిపోయాడు. ఆ అమ్మాయి దగ్గరకు వచ్చింది.

“ఎక్స్‌క్యూజ్మీ.... [illegible] షెల్టర్ మేడమ్?” ఆడపిల్లని అతను సంశయించలేదు.

ఆమె మాట్లాడలేదు.

“క్షమించండి....నా రికార్డు తడిసి పోతుంది....బస్‌స్టాపు వచ్చేవరకు....” ప్రాధేయపడ్డాడు.


ఆమె మళ్లా మాట్లాడలేదు.

“మీకు అభ్యంతరంగా ఉంటే యీ రికార్డు మీరు పట్టుకోండి....నేను తడిసినా ఫర్వాలేదు....ప్లీజ్....” ఈసారి చాల జాలిగా అడిగాడు. ఆమె యీసారి కూడ మాట్లాడలేదు. ఆగిపోయింది. చేతిలో గొడుగు ముందుకు చాచింది. రమణమూర్తి గొడుగులోకి వెళ్లాడు.

“థాంక్స్.... థాంక్యూ .... థాంక్యూ సో మచ్....” ఒకసారి కాదు వరసగా మూడు సార్లు థాంక్స్ చెప్పాడు. ఆమె చిన్నగా నవ్వింది, అన్ని థాంక్స్ ఎందు కన్నట్లు. ఆమె ముందుకు నడిచింది.

రమణమూర్తి మనసు కుదుటపడింది

వర్షం గొడుగుమీద లయవేస్తుంది. ఆ అమ్మాయి నీటి మీద తామరపువ్వు తేలి పోతున్నట్లు అతి నాజూకుగా నడుస్తుంది. రమణమూర్తి తలెత్తి ఓ క్షణం ఆమె ముఖంలోకి చూశాడు. అందమైన అమ్మాయి. అప్సరసలాంటి అమ్మాయి. అతను తత్తరపడిపోయాడు. ఎప్పుడూ




అంత అందమైన అమ్మాయిని చూడలేదు. ఆ అమ్మాయి పక్కను నడవటానికి 'ఇన్ఫిరియారిటీ' ఫీలయిపోయాడు.

ఇప్పుడతను రికార్డు గురించి ఆలోచించడం లేదు. పదేపదే ఆ అమ్మాయిని చూడాలని ఆరాటపడుతున్నాడు. ఆమెతో మాట్లాడాలని ఉబలాట పడుతున్నాడు. కానీ, అతనికి ధైర్యం చాల్లేదు. ఏ ప్రశ్నా అతని పెదాలుదాటి పైకి రాలేదు. 420 సినిమాలో రాజకపూర్‌నూ, నర్గీస్‌నూ ఊహించుకుంటూ నడిచాడు.

బస్‌స్టాపు వచ్చింది. రమణమూర్తి 'థాంక్సండీ' అని చెప్పి బస్ షెల్టర్‌లోకి వెళ్ళిపోయాడు. ఆమె మాట్లాడలేదు. మాట్లాడితే ముత్యాలు రాలిపోతాయన్నటు చిన్నగా నవ్వింది. ఆ నవ్వు అతన్ని గిలిగింతలు పెట్టింది.

మరి కాసేపట్లో పదమూడో నంబరు బస్సు రావడం – ఆ అమ్మాయి వెళ్ళిపోవడం జరిగిపోయాయి.

* * *

ఆ అమ్మాయిని చూసినప్పట్నుంచి రమణమూర్తి మనసు రమణమూర్తి మనసులా ఉండలేకపోయింది. ఆ మనసులో ఏదో తియ్యటిబాధ నిండిపోయింది. ఆమె ప్రేమను పొందాలనే తపన....ఆమె మళ్లా కనిపించదేమో అనే దిగులు అతన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. పరీక్ష హాల్లోకి వెళ్ళేముందు ఎలాంటి ప్రశ్నలు వస్తాయని అతనెప్పుడూ ఆలోచించలేదు. భయ

పడలేదు. ఇప్పుడు అతనిలో భయమూ ఆలోచనలూ కలగాపులగం అయి పోయాయి.

సాయంకాలం కాలేజీనుంచి సరాసరి నిన్నటి బస్ స్టాపు చేరుకున్నాడు. రమణ మూర్తి. అతనికి తెలియకుండానే ఆ అమ్మాయిని మరోసారి చూడాలనే కోరిక అతని మనసులో మంచులా పేరుకుంది. ఆ అమ్మాయి బస్ స్టాపులో కనిపించ లేదు. వాచీకేసి చూశాడు. అతని ఆతృతను గమనించని వాచీ అయిదే చూపించింది. ఆ అమ్మాయి వచ్చేవరకు అక్కడే ఉండా లని నిశ్చయించుకున్నాడు.

మరో పావు గంటలో ఆ అమ్మాయి వచ్చింది. రమణమూర్తి వేపు చూసి నిన్నటి మధుర స్మృతిని గుర్తుచేస్తున్నట్లు చిరునవ్వు నవ్వింది. మైక్రోస్కోపు కింద ఉంచి చూస్తేగాని కనిపించనంత చిన్నగా నవ్వేడు. రమణమూర్తి ఆమెతో ఏదోలా మాట్లాడాలనుకున్నాడు. కానీ, ఏదో పిరికి తనం అతని ప్రయత్నానికి అడ్డు తగిలింది. నిన్న రికార్డు తడిసిపోతుందనే భయంతో తను ఆ అమ్మాయితో మాట్లాడేడు. కానీ. ఈ రోజు తనెలా మాట్లాడగలడు? తను కావాలని మాట్లాడినా సభ్యతగా ఉంటుందా? అనుకున్నాడు. అనుకుంటూనే మనసులో ఓ మాస్టరు ప్లాన్ గీసుకున్నాడు.

ఆ రోజు మొదలు రమణమూర్తి సాయంత్రం అయిదయ్యేసరికి బస్‌స్టాప్‌కు రావడం అలవాటు చేసుకున్నాడు. అతను వచ్చిన పావుగంటకు ఆ అమ్మాయి వస్తుంది. అతని వేపు చూసి చిన్నగానవ్వు తుంది. అతను కళ్ళతోనే పలకరిస్తాడు. ఆమె తల వంచుకొని కాలివేలితో గిరులు గీస్తుంది. అతను మరెప్పైనా చూస్తే ఆమె అతనివేపే చూస్తుంది. అతను యిబ్బంది పడిపోతాడు. మరి కాసేపట్లో బస్సురావడం ఆమె వెళ్ళిపోవడం జరిగిపోతాయి. నెల రోజుల తర్వాత రమణమూర్తికి అర్థం అయిపోయింది—ఆ అమ్మాయికి కూడ తన మీద 'యింటరెస్ట్' ఉందని.


ఒక రోజు రమణమూర్తి ఆ అమ్మాయి వచ్చిన మరో పావుగంటకు బస్‌స్టాపుకు వచ్చాడు. ఆమె ఎప్పటిలానే నవ్వింది.

"ఏఁవండీ....నంబర్ లెవెన్ వెళ్ళి పోయిందా?" రమణమూర్తి చాల ధైర్యాన్ని కూడ దీసుకొని అడిగాడు.

"ఊహుఁ!... ఆ బస్సు రాలేదండి." ఆ అమ్మాయి నోటినుంచి ముత్యాలు రాలి పోయాయి. అతనికి యింకాస్త ధైర్యం వచ్చింది.

"ఏఁవండీ... మీ రెక్కడైనా ఉద్యోగం చేస్తున్నారా?" మరో పదినిమిషాలతర్వాత అడిగాడు. ఆమె చేతిలో టిఫిన్ బాక్సు. వీక్లీసూ చాల రోజులనుంచి చూస్తున్నాడు.

"అవునండీ....మీరు చదువు తున్నారా?" ప్రశ్నకు ప్రశ్న. ఆమె నోష ల్గా అంది.




రమణమూర్తి 'యమ్మెస్సీ' అని గర్వంగా చెప్పాడు.

ఆ రాత్రి రమణమూర్తి చాలసేపటి వరకు నిద్రపోలేదు. ఏదో ఘన విజయం సాధించినట్లు అతని మనసంతా బరువయి పోతుంది. మర్నాడు తన క్లాస్‌మేట్ సుబ్బారావుతో జరిగిన విషయం చెప్పాడు. కాలేజీలోనే ప్రేమంటే ఏమిటో తెలుసుకున్న సుబ్బారావు, యూనివర్సిటీలో చదువుతూ ప్రేమంటే ఏమిటో తెలుసుకోవాలని ప్రయిత్నించదేమి చెప్మా అని రమణమూర్తిపై బోలెడంత పిటీ చూపించేవాడు. తనలా ప్రయోజకుడవు తున్నాడని గ్రహించిన సుబ్బారావు, రమణమూర్తిని కౌగిలించుకున్నంత పనిచేశాడు. తర్వాత రమణమూర్తి తన మనసు దోచుకున్న ఆ అమ్మాయిని సుబ్బారావుకిచూపించాడు.

"సో బ్యూటీఫుల్ మూర్తీ!...షి యీజ్ జస్ట్ లైక్ 'హేమామాలినీ" అని సుబ్బారావు కాంప్లిమెంట్ చేశాడు. రమణమూర్తి భానుమూర్తిలా వెలిగిపోయాడు.

ఓ చక్కని కథలో అందమైన మలుపులా రమణమూర్తికీ ఆ అమ్మాయికీ మధ్య స్నేహం ఏర్పడింది. రమణమూర్తి ఏదో విషయాన్ని కల్పించుకొని మాట్లాడేవాడు. ఆమె కూడ మాట్లాడేది. అతను కాలేజీ నుంచి రావడం లేటయినా ఆమె వెళ్ళి పోయేది కాదు. అతను వచ్చేవరకు ఉండేది. పైగా 'ఈ రోజు మీ రెందుకు ఆలస్యం అయిపోయారు?" అని అడిగేది.

రమణమూర్తి—'నా తో సిన్మాకు

వస్తారా?....సరదాగా బీచికి రాకూడదూ? మీతో ఏకాంతంగా మాట్లాడనిస్తారా?' అని ఎప్పుడూ అడగలేదు. తొందరపడలేదు. ఓసారి—'మా యూనివర్సిటీలో ఎగ్జిబిషన్ చూడండి' అని మాత్రం ఆమెతో చెప్పాడు.

ఆ అమ్మాయి ఎగ్జిబిషన్ చూడటానికి వచ్చింది.

యాటమిక్ స్ట్రక్చర్ని విజిటర్స్‌కి ఎక్స్‌ప్లెయిన్ చేస్తున్న రమణమూర్తికి—"ఒరేయ్, మీ హేమామాలినీ వచ్చింది రోయ్" అని సుబ్బారావు చెప్పాడు. రమణమూర్తి సంతోషానికి హద్దుల్లేక పోయాయి. అతను ప్రొఫెసరుగారి అనుమతి తీసుకొని ఆ అమ్మాయికి, ఆమెతో వచ్చిన అమ్మాయిలకు ఎగ్జిబిషన్ అంతా చూపించాడు. కాంటీన్‌లో టిఫిన్లూ, డ్రింకులూ యిప్పించాడు. ఆ రోజే అతనికి తెలిసింది—'ఆ అమ్మాయి పేరు శకుంతల' అని. చాల అందమైన పేరనుకున్నాడు.

ఆ అమ్మాయి లంతా వెళ్ళిపోయిన తర్వాత—"ఒరేయ్ మూర్తీ! నువ్వదృష్ట వంతుడివోయ్....ఆలస్యం కాకుండా మీ హేమామాలినికి నీ ప్రేమను తెలియజెయ్" అని సుబ్బారావు అన్నాడు.

"ఎలా ప్రొసీడ్ అవ్వాలో తెలియటం లేదురా" రమణమూర్తి అమాయకంగా అన్నాడు. సలహా యిమ్మని అడిగాడు.

"ఒరేయ్ ఫూల్....నువ్వా అమ్మాయిని ప్రేమిస్తున్నట్లు ఓ లవ్ లెటర్ రాసి యివ్వరా...."

"థాంక్యూ....మైడియర్ అడ్వైజర్... థాంక్యూ...."

* * *

'మీకు బుద్ధుందా?....మీరేదో మంచి వారని అభిమానంగా మాట్లాడతారని అనుకున్నాను. ఇలా ప్రేమ లేఖలు రాస్తారని అనుకోలేదు. అసభ్యతగా ప్రవర్తిస్తారని ఊహించలేదు....ఛీ ఛీ...' అని శకుంతల చీదరించుకుంటుందని రమణమూర్తి భయపడి ఉత్తరం రాసి ఆమెకు యివ్వలేదు. చాల చాల ఆలోచించాడు. బాగా ఆలోచిస్తేగాని ఏ నిర్ణయం తీసుకోలేడు.

ఇంతలో పరీక్షలు ముంచుకు వచ్చాయి. రమణమూర్తి పరీక్షల హడావుడిలోపడి ఆ ప్రయత్నం పూర్తిగా మానుకున్నాడు. అయితే, శకుంతలను చూడకుండా ఉండలేక పోయేవాడు. ప్రతిరోజు బస్‌స్టాప్‌లో కలిసేవాడు. ఆమెతో కాసేపు మాట్లాడేవాడు.

పరీక్షలు అయిపోయాయి. సుబ్బారావు వాళ్ళ ఊరు వెళ్ళిపోతూ రమణమూర్తిని హెచ్చరించాడు—'తను తిరిగి వచ్చేసరికి హేమామాలినీ రమణమూర్తీ కలిసి సినిమాలకీ షికార్లకీ వెళుతూ ఉండాలని.'

* * *

ఆ రోజు శనివారం.

రమణమూర్తి ట్రిమ్‌గా తయారయ్యాడు.

క్రిందటి రాత్రి కష్టపడి రాసిన ఉత్తరాన్ని మరోసారి చదువుకున్నాడు.

'శకుంతలగార్కి,

తొందర పడి ఉత్తరం రాస్తున్నానని మీ రనుకుంటే నన్ను క్షమించండి. మొదటిసారి మిమ్మల్ని ముత్యాలవానలో చూశాను. తొలి చూపులోనే నన్ను దోచుకున్నారు. మీ నుదుటిమీద జీరాడే ముంగురుల్ని సవరించాలనీ, మీ చెక్కిళ్ళలో నన్ను నేను చూసుకోవాలనీ, మీ చిరునవ్వులు నా హృదయంలో దాచుకోవాలనీ ఆశలు పెంచుకున్నాను. మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మీరు ఔనంటే మిమ్మల్ని 'నా శకుంతల'గా చేసుకుంటాను.

మీ అంగీకారాన్ని తెలుపుతూ రేపు అంటే సోమవారం యిక్కడే ఇదే సమయంలో కనిపించాలి. మామూలుగా కాదు. మీ నల్లంచు తెల్లచీరలో—మీ అందమైన చిరునవ్వుతో.

—రమణమూర్తి'

ఉత్తరాన్ని మడతపెట్టి పుస్తకంలో దాచాడు. హుషారుగా ఈలవేసుకుంటూ బస్‌స్టాపు వేపు నడిచాడు.

రమణమూర్తి శకుంతలతో ఆమాటా ఈమాటా మాట్లాడేడు. తన కాలేజీకి రేపట్నుంచి సెలవులన్నాడు తన క్లాస్‌మీద బోటు అని చెప్పాడు ఈ మధ్య తనకు చదువు మీద ధ్యాస పోతుందన్నాడు. తనకూ ఉద్యోగం చేయాలనిపిస్తుందని చెప్పాడు అదన్నాడు. ఇదన్నాడు అతను చెప్పిన ప్రతిమాటకు శకుంతల నవ్వింది. అతి మెత్తగా నవ్వింది

శకుంతల బస్సెక్కేముందు—"ఈ పుస్తకం తీసికెళ్ళి చదవండి" అంటూ రమణమూర్తి తన చేతిలో ఉన్న పుస్తకం ఆమెకు అందించాడు. శకుంతల అతని ప్లాన్ పసిగట్టినట్టుంది. ఆశ్చర్యపోలేదు. మామూలుగా పుస్తకం తీసుకుంది.

రమణమూర్తి మనసు తేలికపడింది.

సోమవారం సాయంత్రం ఎప్పుడు వస్తుందా అని రమణమూర్తి ఎదురు చూశాడు. ఎదురు చూసిన సోమవారం వచ్చింది. సాయంత్రం అయింది రమణమూర్తి బస్‌స్టాపుకు వెళ్లాడు శకుంతల కనిపించలేదు. అరగంట గంట రెండు గంటలు శకుంతల రాలేదు. రమణమూర్తి బాధ పడిపోయాడు శకుంతల ఎందుకు రాలేదు? ఆమె తనను ప్రేమించడం లేదా? తను తొందరపడ్డాడా? అనేకమైన ఆలోచనలు అతన్ని అల్లరి చేశాయి. చివరకు ఏదో నిర్ణయానికి రాబోయాడు. అంతలో శకుంతల వచ్చింది. మామూలుగా కాదు. నల్లంచు తెల్లచీరలో అందమైన చిరునవ్వుతో అంటే శకుంతల తనను? రమణమూర్తి సంశయాలన్నీ గాలిలో కలిసిపోయాయి.

"థాంక్యూ థాంక్యూ శకుంతల గారూ." రమణమూర్తి మనసులో ఓ కొత్త ఆనందం ఉరకలు వేసింది

"మీ పుస్తకం తీసుకోండి" అని శకుంతల తన చేతిలో ఉన్న పుస్తకం రమణమూర్తికి అందించింది.

"నేను తొందరపడితే క్షమించండి." పుస్తకం తీసుకుంటూ అన్నాడు, రమణమూర్తి.

శకుంతల గడుసుగా అంది.

"ఆ మాట మీ ఉత్తరంలో రాశారు."

రమణమూర్తి ఆమె నవ్వుతో శృతి కలిపాడు.

"ఈ నల్లంచు తెల్లచీర మీకెంతో అందంగా ఉంటుంది." మళ్లా రమణమూర్తి మాట్లాడేడు.

"నాకు టైం అవుతుంది.... వెళతాను ..." శకుంతల మాట మారుస్తూ అంది.

"అన్యాయం.... మీరు వచ్చి పదినిమిషాలు కాలేదు ..తొందరపడుతున్నారు."

"ఈరోజు ఆఫీసులో ఆలస్యం అయింది. ఇంటిదగ్గర చూస్తూ ఉంటారు."

"మరి.... మీ అభిప్రాయం.... ఐ మీన్ మీ రిప్లయ్...." రమణమూర్తి కిప్పుడు భయంలేదు. చాల చనువుగా అడిగాడు.

అతని చేతిలో ఉన్న పుస్తకం వేపు చూసి—'అందులో ఉంద'ని శకుంతల కళ్ళతో చెప్పింది.

గుర్రుపెట్టుకుంటూ వచ్చిన పదమూడో నంబరు బస్సెక్కి— శకుంతల వెళ్ళిపోయింది.

* * *

మూర్తిగార్కి,

మీరు నిజంగా తొందరపడ్డారు. నా గురించి మీకు తెలిసి ఉంటే మీరు నాకు ఉత్తరం వ్రాసేవారు కాదు. మీరూహించుకుంటున్నట్లు నేను పెళ్ళికాని అమ్మాయిని కాదు. నాకు చిన్నతనంలోనే మహాకరితో పెళ్ళి జరిగిపోయింది. కానీ, నాకు ఊహ తెలిసేసరికి అతను చనిపోయారు. జీవితం అంటే ఏమిటో తెలియని రోజుల్లోనే నా జీవితం మారిపోయింది.

ప్రస్తుతం నేను మా అన్నయ్య - వదినతో ఉంటున్నాను. వాళ్లే నాకు చదువు చెప్పించి ఉద్యోగం చేయిస్తున్నారు. సాంప్రదాయాలూ, కట్టుబాట్లూ—వీటినికాదని నన్నెవరు పెళ్ళి చేసుకుంటారు: నాకా ఆశ లేదు.

మీరంటే నాకెంతో యిష్టం. అలా అని మీతో అబద్ధం చెప్పి మిమ్మల్ని మోసం చేయలేను. అందుకే మీతో నిజం చెప్పాను. మీరు ధైర్యంగా నన్ను పెళ్ళి చేసుకోగలరా ? నా జీవితాన్ని మార్చగలరా ? అందుకు మీరు సిద్ధపడితే నా కభ్యంతరం లేదు. మిమ్మల్ని ప్రేమిస్తాను. జీవితాంతం మీ శకుంతలగా ఉండిపోతాను.

—శకుంతల.'

రమణమూర్తి మనసు కెవ్వుమంది. తను ఊహించని జవాబు అది. తను ఎన్నో ఊహలతో తెరచిన ఉత్తరంలో తనను గాయపరచే కథ ఉంది. తనకు ప్రేమంటే ఏమిటో తెలియదు. శకుంతలను చూసినప్పుడే తనలో మార్పు కలిగింది. శకుంతలను సొంతం చేసుకోవాలని, ఆమెను ప్రేమించాడు. తన తల్లిదండ్రులతో చెప్పి శకుంతలను పెళ్ళి చేసుకోవాలని ఆశలు పెంచుకున్నాడు. కానీ, అనుకోని విధంగా తన ప్రేమ కథ అడ్డం తిరుగుతుందని కలలో కూడ ఊహించలేదు. తను ప్రేమించిన అమ్మాయి బాల వితంతువు అని తెలిసేసరికి తనకేదో షాక్ తగిలినట్లయింది. తను సహించలేకపోయాడు.

శకుంతల మీద తనకున్న ప్రేమను




చంపుకోలేడు. అలా అని ఆమెను పెళ్ళి చేసుకునే ధైర్యం తనకు లేధు. చీకటిలో వడుస్తున్న ఓ అమ్మాయిని వెలుగులోకి తీసుకు రావడం పెద్ద త్యాగం కావచ్చు. కానీ, అలాంటి త్యాగం ఎంతమంది చేయ గలరు? శకుంతలను పెళ్ళి చేసుకోవటానికి తను సిద్ధపడినా తనవాళ్ళు యిష్టపడతారా? శకుంతలకు రెండో పెళ్ళి అంటే అంగీక రిస్తారా? తను గొప్ప పని చేసినందుకు ఎవరూ హర్షించరు. పైగా తనమీద తన వాళ్ళమీద నిర్లిప్తత చూపిస్తారు. ఎందుకో, సంఘం అంటే తనకూ భయమే!

ఆలోచనలతో రమణమూర్తి మెదడు మొద్దుబారిపోయింది. మరోవేపు శకుంతల కావాలనే తపన అతన్ని వేధిస్తుంది. స్వతహాగా తనకు తాను ఓ నిర్ణయాన్ని తీసుకునే అలవాటు మొదట్నుంచి లేదు. ఓ పరిష్కారాన్ని వెదుక్కొనేశక్తి అంత కంటే లేదు. తనకు ఎవరైనా ఆలోచించి సలహా యివ్వాలి. తనకో మార్గాన్ని చూపించాలి.

వెంటనే రమణమూర్తి జరిగినదంతా తెలియజేస్తూ, తొందరగా జవాబు ఇమ్మని సుబ్బారావుకు ఉత్తరం రాశాడు.

. నెలరోజులు గడిచాయి. సుబ్బారావు నుంచి జవాబు రాలేదు. రమణమూర్తి బాగా నీరసించిపోయాడు. బస్‌స్టాప్‌కు వెళ్ళడం మానుకున్నాడు. నెలరోజుల్లో ఒక్కసారైనా శకుంతలను చూడలేదు. తన అసమర్థతలు శకుంతలకు చెప్పుకోవా లనిపించలేదు. ముందెప్పుడూ శకుంతలను చూడకుండా ఉండలేకపోయేవాడు. ఆత్మ వంచన చేసుకుంటున్నట్లు బాధ పడి పోయాడు.

మరో పదిహేను రోజులు గడిచిన తర్వాత సుబ్బారావు నుంచి ఉత్తరం వచ్చింది.

'డియర్ మూర్తీ,

నీ ఉత్తరం నిన్ననే చూశాను. ఈ మధ్య నేను ఊళ్ళో లేను. ఆలస్యానికి

క్షమిస్తావని అనుకుంటున్నాను.

నువ్వు నిజంగా అమాయకుడవనిపిస్తుంది. జీవితానికి పవిత్రత అవసరం. పెళ్ళి ముఖ్యం కాదు. ఆ అమ్మాయికి ఊహ తెలియకముందే పెళ్ళి చేశారు. ఆమెకు ఊహ తెలిసేసరికి అతను చనిపోయాడు. ఆమెకు ప్రేమంటే ఏమిటో తెలియనిరోజుల్లోనే అన్నీ జరిగిపోయాయి. నీతో ఆమె నిజం చెప్పింది. అది ఆమె ప్రేమకు నిదర్శనం.

కానీ, నువ్వు పాతబడ్డ ఆలోచనలతో మనసు పాడు చేసుకుంటున్నావు. ఈ రోజుల్లో వర్ణాంతర వివాహాలు, బాల వితంతు వివాహాలు పెద్ద సమస్యలేమీ కాదు. వాటికి త్యాగాలూ చచ్చుబండలూ అవసరం లేదు. సంఘం.. సంఘం....అని కబుర్లు చెప్పేవాళ్ళు పిరికివాళ్ళు. నీ మనసుకి నచ్చినప్పుడు ఒకరికోసం భయపడక్కర లేదు. శకుంతలను నిరభ్యంతరంగా పెళ్ళి చేసుకో.

ఆలస్యం కాకుండా శకుంతలకు కనిపించి నీ అంగీకారాన్ని తెలియజేయ్. త్వరలో వెడ్డింగుకార్డు పంపిస్తావని ఆశిస్తాను. —నీ సుబ్బారావు.

రమణమూర్తి తీవ్రంగా ఆలోచించాడు. సుబ్బారావు రాసిన ఉత్తరం తనకెంతో నచ్చింది. మసిబారిన అద్దాన్ని తుడిచి నట్లయింది. తనకు శకుంతల కావాలి. ఆమె కోసం తనేమైనా చేయాలి. ఓ స్థిర నిశ్చయానికి వచ్చాడు.

ఆ సాయంత్రమే రమణమూర్తి బస్ స్టాపుకు వెళ్ళాడు. కానీ, శకుంతల కనిపించలేదు. తర్వాత వరుసగా రెండు రోజులు చూశాడు. ఆమె కనిపించలేదు. అతనికి పిచ్చి పట్టినట్లయింది.

వారం రోజుల తర్వాత—మెయిన్ రోడ్డు మీద శకుంతల కనిపించింది. రమణమూర్తి సంబరపడిపోయాడు. 'శకుంతలా' అని గట్టిగా అరవాలనుకున్నాడు. కానీ ఆమె కళ్ళలో నిరసనభావమూ, ఆమె ప్రక్కనే నడుస్తున్న మరో యువకున్నీ చూసి పెదవులు కదపలేకపోయాడు. రమణమూర్తి అడుగులు వెనక్కి వేశాడు. తనొక నిర్ణయాన్ని తీసుకొనే వరకు శకుంతల ఎదురు చూడలేదు. కారణం,....

శకుంతల అప్పుడూ, ఇప్పుడూ—ఎప్పుడు కనిపించినా రమణమూర్తి తలలో ఒకే ప్రశ్న మెదులుతుంది—'తననూ తన ప్రేమనూ పరీక్షించటం కోసం శకుంతల తనకు పెళ్ళయిందని అబద్ధం చెప్పిందా? లేక తను చేయలేని ధైర్యాన్ని అతను చేశాడా?'' అని. *

ఈ ముగింపు నచ్చని వాళ్ళకు

## మరో ముగింపు:—

శకుంతల ఉత్తరం చదివి, రమణమూర్తి చాల తీవ్రంగా ఆలోచించాడు. తనకు శకుంతల కావాలి. శకుంతల ప్రేమ కావాలి. శకుంతలతో తన జీవితం సాగాలి. ఆమె జీవితంలో పచ్చి నిజాన్ని బయట పెట్టి ఆమె సంస్కారాన్ని చాటుకుంది. ఏ స్వార్థం లేని నిష్కల్మషమైన శకుంతలను భార్యగా పొందటం కంటె తనకు గొప్ప అదృష్టం ఏముంటుంది?

మర్నాడు—రమణమూర్తి మామూలుగా బస్ స్టాపులో శకుంతలను కలుసుకున్నాడు.

"మీరు జీవితాంతం నా శకుంతలగా ఉండిపోవాలి" రమణమూర్తి మెల్లగా, తియ్యగా అన్నాడు. ఆ మాటలు శకుంతల హృదయపు లోతుల్లో వలయాలుగా తిరిగాయి.